తెల్లవారుఝామున మూడు గంటవుతూంది.

పెళ్ళి పందిరి రంగురంగుల విద్యుద్దీపాలతో కన్నులు మిరుమిట్లు గొల్పుతూంది. పందిట్లో పచ్చని తోరణాలు, రంగురంగుల కాగితపుపూలు, సన్నగా అలా గాలిలో తేలివస్తున్నట్లున్న సన్నాయి పాట, పడుచుల పట్టుచీరల గరగరలు, నైలాన్, టెరిలిన్ చీరల తళతళలు, మగువల మృదుమధుర మందహాసాలు, పడుచుల పరువపు శరీరాల పచ్చని కాంతులు, ఆ పరువపు శరీరాలపై తూపులు పాడిచేటట్లున్న పడుచువారి పదునైన (కోర) చూపులు, మనసైన అవివాహిత యువయువకుల దొంగచూపులు, మధ్యవయస్కులలో పిల్ల దంపతుల మనస్సుల్లో తమ పెళ్ళినాటి మధుర స్మృతులు, పిల్లల కేరింతలు, పరిచయస్థుల కబుర్లు, బావామరదళ్ళ పరాచికాలు, సరస సరాగాల గలగల నవ్వులు. పెళ్ళిపందిరి సందడిగా, సంబరంగా, రద్దీగా, కోలాహలంగా ఉంది.

వధువు తల్లిదండ్రులు వరుని కాళ్ళు కడిగి, కన్యాదానం చేశారు. పెళ్ళి మంటపంలో వధువు ఉమ, వరుడు సురేందర్ రెడ్డి పెళ్ళిపీటల మీద ఆసీనులయ్యారు.

కాసేపైన తరువాత పురోహితుడు వియ్యంకులిరువురివేపు చూస్తూ, "మా పెట్టుపోతలు (ఇచ్చిపుచ్చుకోవడాలు) చూసుకోండి" అన్నాడు.

వరుని తండ్రి నారాయణరెడ్డి, తాము వధువుకిస్తామన్న నగలన్నీ పెట్టెలోంచి తీసి ఇచ్చాడు. ముత్తైదువులు ఆ నగలన్నీ ఉమకు అలంకరించసాగారు.

వధువు తండ్రి కృష్ణారెడ్డి తాను వరునికిస్తానన్న కట్నం డబ్బు పదివేలు తేవడానికి మేడమీది తన గదిలోకి వెళ్ళాడు. జేబులో తాళంచెవులగుత్తి లేదు. మరోసారి జేబులన్నీ తడిమి చూసుకున్నాడు. కనిపించలేదు. టేబుల్ దగ్గరికి వెళ్ళి చూశాడు. గుత్తి దానిపైనే ఉంది. గబగబా టేబుల్ డ్రాయర్ సొరుగు కున్న తాళం తీసి, సొరుగు బయటకు లాగాడు. అంతే! ఆయన గుండె ఆగినంత పని అయింది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. వణకసాగింది. సొరుగులో ఆయన రాత్రి ఉంచిన ఐదువేల రూపాయలు లేవు. సొరుగు ఖాళీగా ఉంది. తడబడుతున్న అడుగులతో బీరువా దగ్గరికి వెళ్ళి దాన్ని తెరిచాడు. అతను అందులో ఉంచిన పదివేల రూపాయలు అలాగే ఉన్నాయి. లెక్కపెట్టి చూశాడు. సరిగానే ఉన్నాయి. 'హమ్మయ్య' అనుకొని నిట్టూర్చాడు. 'గుడ్డిలో మెల్ల. ఇంతా నయం' అనుకున్నాడు. అయినా, అతని ఒంటి వణుకు తగ్గలేదు.

మరి డ్రాయరు సొరుగులోని ఐదువేలు? ?. . . ఎవరో దొంగిలించి ఉంటారు. ఇప్పుడు తను ఎవర్ని అడగాలి? అయితే మరి ఇప్పుడు? . . . అతని గుండె దడదడ కొట్టుకోసాగింది. కాళ్ళకింది భూమి కదిలిపోతున్నట్లనిపించసాగింది. ఒంట్లో నీరసం, నిస్సత్తువ. కళ్ళు తిరిగాయి. ఒళ్ళు తూలింది. మంచం మీద కూలబడ్డాడు.

కృష్ణారెడ్డి ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలవేళ అప్పుగా తెచ్చిన డబ్బు ఐదు వేలు డ్రాయర్లో దాచి, తాళం వేశాడు. కాని, పనితొందరలో తాళంచెవుల గుత్తిని అక్కడే వదిలివెళ్ళాడు. అది గమనించిన ఎవరో ఆ డబ్బు దొంగిలించారు. వారం రోజుల క్రితమే తన జీవిత భీమా డబ్బు పదివేలు తెచ్చి బీరువాలో

**చదువులు, డిగ్రీలు మనిషికి సంస్కారాన్ని కలిగించవు. తల్లిదండ్రుల మాట జవదాటడం ఘోరపాపం అనుకునే యువకుడు తన వ్యక్తిత్వాన్ని చంపుకుని, ఆత్మనే మలినపరచుకుంటాడు, ఈడైన ఆడపిల్ల జోడైనపుడు, అతని కళ్ళకు కమ్మిన చీకటి పొరల్ని తొలగించి, కనువిప్పు కలిగించాలి. భర్తని అదుపులోకి తెచ్చుకోలేని ఆడపిల్ల వుంటుందా!**

దాచాడు. అది అలాగే ఉంది. డ్రాయర్ సొరుగులోనిదే పోయింది.

'మరి ఇప్పటి మాట?'. . . తను దాని గురించి ఆలోచించలేకపోతున్నాడు.

పావు గంట గడిచింది.

కృష్ణారెడ్డి రావటం ఆలస్యమయ్యేసరికి, ఆయన మిత్రుడు రాజు మేడమీదికి వచ్చాడు. మిత్రుని వాలకం చూసి గాభరాపడి, "ఏం జరిగిందిరా?" అన్నాడు.

"కొంప మునిగిందిరా, రాజా!" అన్నాడు కృష్ణారెడ్డి గద్గదస్వరంతో.

## టేకుమాల్ ప్రభురెడ్డి

"అసలేం జరిగింది?"

కృష్ణారెడ్డి అంతా చెప్పాడు. అది విని రాజుకూడా ప్రమాస్పడిపోయాడు. ఇరువురిమధ్య రెండు నిమిషాల పాటు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"పద" అన్నాడు రాజు తేరుకొని.

"వాళ్ళకేం సమాధానం చెబు..." మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"ఎందుకురా ఈ ఏడ్పు? ముందు జరగవలసింది చూద్దాం పద."

"రూపాయి కాదు. రెండు కాదు. ఐదు వేలు ... అదీ ఇల్లు తాకట్టుపెట్టి తెచ్చినదని నీకూ తెలుసు కదా!"

"తెలుసు. కాని, ఇప్పుడేం చేయగలుగుతాం చెప్పు?"

"మరి మగపెళ్ళివారికి ఏమని చెబుదాం?"

"వాస్తవం వారి ముందుంచి, నచ్చ చెబుదాం. రా!"

కృష్ణారెడ్డి పదివేలు తీసుకొని రాజువెంట పందిట్లోకి వచ్చాడు. ఆ డబ్బును ఓ పళ్ళెంలో ఉంచాడు. నారాయణరెడ్డి ఆ డబ్బును లెక్కపెట్టి 'ఇవ్వు మిగతాది?' అన్నట్లు వియ్యంకునివేపు చూశాడు.

రాజు నారాయణరెడ్డిని బయటకు రమ్మని పిలిచాడు. జరిగిన సంగతి అంతా వివరించి మిగతా డబ్బు పెళ్ళి తరవాత సర్దుతామన్నారు. భర్తవెంటే వచ్చిన సుందరమ్మ ఎగిరిపడింది. డబ్బు ముట్టేవరకు పెళ్ళి జరగడానికి వీల్లేదంది.

కృష్ణారెడ్డి నారాయణరెడ్డి దంపతుల చేతులు పట్టుకొని, "బావగారూ! ఇది అనుకోకుండా జరిగింది. తరవాత తప్పకుండా మీ సొమ్ము మీకు ముట్ట జెబుతాను" అన్నాడు, దీనంగా, జాలిగా వారి ముఖాల్లోకి చూస్తూ.

నారాయణరెడ్డి మౌనం వహించాడు. సుందరమ్మ కఠినంగా అంది:

"మా కదంతా తెలియదు. మీరేమైనా కండి. మాకు ఇస్తామన్న డబ్బుకు ఒక్క పైస తక్కువ ఉన్నా ఈ పెళ్ళి జరగదు."

"చెల్లెమ్మా! నా మాట నమ్మమ్మ. మీ రన్నట్లుగానే ఒక్క పైసా తక్కువకాకుండా తరవాత ముట్ట జెప్పుకుంటాను. కాని ఈ సమయాన ఇప్పుడు ఎక్కడనుండి తేను?"

"ఇలాటి మాటలు ఎందరివో, ఎన్నోసార్లు విన్నాము."

"నే నందరిలా కాదు."

"నీవేం సత్యహరిశ్చంద్రుడివా?"

అరచేతితో బలంగా ముఖంమీద కొట్టినట్లు చరిచినట్టయింది కృష్ణారెడ్డికి. అయినా, అతను రోషపడలేదు. అవసరం తనది. ఎంత రోషమున్నా తను ఆడపిల్ల తండ్రి. మగపెళ్ళివారికి లోకువ. పెళ్ళిలో ఏ లోటు జరగకుండా ఉండాలని తను ఎంతో ప్రయత్నించాడు. కాని తుదకు ఇలా జరిగింది. అది తన దురదృష్టం.

అప్పుడే పందిట్లో గుసగుసలు బయలుదేరాయి.

"సత్యహరిశ్చంద్రుణ్ణి అని చెప్పలేను గానీ, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాను. మీ డబ్బు పువ్వుల్లో పెట్టి ముట్టచెబుతాను."

"అదంతా కుదరదు. డబ్బు మొత్తం ఇస్తారా? లేక మమ్మల్ని వెళ్ళిపొమ్మంటారా? ఈ కట్నాలఫలం ఎవరికి తెలియువని!"

కృష్ణారెడ్డి ఎంతగానో బతిమాలాడు. నచ్చచెప్పటానికి రాజు ఎంతో ప్రయత్నం చేశాడు. కాని, సుందరమ్మ ససేమిరా వీల్లేదంది. డబ్బు పూర్తిగా ముడితేనేగానీ పెళ్ళి జరగనివ్వనంది. నారాయణరెడ్డి శిలలా నిలబడిపోయాడు ఏమీ పాలుపోక. ఆయన పెళ్ళాంచేతిలో కీలుబొమ్మ!

కట్నండబ్బు పూర్తిగా లేదన్న వార్త పెళ్ళివిడిదిలో అంతా ఒక్క క్షణంలో ప్రాకిపోయింది. అంతా చెవులు కొరుక్కోసాగారు. తలోరకంగా వ్యాఖ్యానించసాగారు. ఈ మాట ఉమ చెవిలోకూడా పడింది. ఆమె గుండెల్లో రాయి పడ్డట్టయింది.

సుందరమ్మ కృష్ణారెడ్డి ఎంతగా బతిమాలుతున్నా వినిపించుకోకుండా పందిట్లోకి వచ్చి, "సురేందర్! లే! వెళ్ళిపోదాం" అంది.

సురేందర్‌రెడ్డి తల్లివేపు బిత్తరపోయి చూశాడు.

"అలా చూస్తావేరా? వాళ్ళు కట్నం ఇవ్వలేరట. వెళ్దాం పద."

సురేందర్‌రెడ్డి లేచి నిలబడ్డాడు.

కృష్ణారెడ్డి వియ్యపురాలిని బతిమాలుతూనే ఉన్నాడు. కాని సుందరమ్మ ససేమిరా అంటూంది. ఆయన నారాయణరెడ్డి కాళ్ళు పట్టుకొని, "బావగారూ! మీరైనా చెప్పండి" అన్నాడు, దీనంగా, జాలిగా, జాలిగా.

సుందరమ్మ భర్తవేపు కోపంగా చూస్తూ, "బెల్లం కొట్టిన రాయిలా నిలబడి అలా చూస్తారేం?

వెళ్లి మనవాళ్లందర్నీ సిద్ధం కమ్మనండి వెళ్లడానికి" అంటూ గదమాయించింది.

నారాయణరెడ్డి తన కాళ్లను పట్టుకున్న కృష్ణారెడ్డి చేతులను విదిలించుకొని వెళ్లిపోయాడు విడిదివేపు.

కృష్ణారెడ్డి సురేందర్‌రెడ్డిని, సుందరమ్మని పిచ్చిగా అటు, ఇటు తిరుగుతూ ప్రతిమాలుకోసాగాడు. కాని, సుందరమ్మ తను నిలబడిన మెట్టు దిగి రాలేదు.



కృష్ణారెడ్డి పెళ్లికుమారుడి చేతులు పట్టుకొని, "బాబూ! నీవైనా కనికరించు. మీ కిస్తామన్న డబ్బు పువ్వుల్లో పెట్టి ముట్టచెబుతాను" అన్నాడు.

"అదేం కుదరదండీ! ముందు డబ్బు ఇవ్వండి. తరవాతే పెళ్లి" అన్నాడు సురేందర్‌రెడ్డి, తల్లి మాటను బలపరుస్తున్నట్టు.

ఉన్నదనుకున్న చివరి ఆశ అడియాసకాగా నీరు కారిపోయాడు కృష్ణారెడ్డి.

అంతవరకు తల వంచుకొని కూర్చొని ఉన్న ఉమ పెళ్లికుమారుడి మాటలు విని చటుక్కున తల పైకెత్తింది. ఆమె క్రోధారుణనేత్రాలు చింతనిప్పుల్ని వర్షిస్తున్నాయి. అతణ్ణి చూడగానే ఆమెలో అసహ్యం, కసి, ఏహ్యత, ద్వేషం, క్రోధం ఒక్కుమ్మడిగా ముంచుకువచ్చాయి. కాని తను అబల, అశక్తురాలు, అసమర్థురాలు. అతన్ని ఏమీ చేయలేనన్న నగ్నసత్యం స్ఫురణకువచ్చి కళ్లముందు కదలాడగానే, ఆమెను నీరసం, నిస్సత్తువ ఆవరించాయి. వాటిలోనించి దుఃఖం వచ్చింది. మగ పెళ్లివారి తరఫు స్త్రీలు వచ్చి ఆమెకు అలంకరించిన నగలన్నీ ఊడదీశారు. వారు చేసిన ఈ పనిలో ఉమ దుఃఖం కట్టలు తెంచుకుంది. పీటమీంచి లేచి తన గదిలోకి పరిగెత్తిం దామె.

గోడ గడియారం నాలుగు గంటలు కొట్టింది.

కట్నంగొడవ రాకపోతే ఈవేళకి పెళ్లి జరిగి పోయేది. పందిరి కలకలలాడుతూండేది. కాని ప్రస్తుతం అదే పెళ్లిమంటపం శ్మశానంలా, ఏడ్పులతో, వేడినిట్టూర్పులతో నిండిపోయింది.

మగపెళ్లివారు వెళ్లిపోవటానికి తమ మూటా ముల్లె సర్దుకోసాగారు.

గదిలోకి వెళ్లిన ఉమ మంచంలో బోర్లాపడి తలగడలో తన ముఖాన్ని దాచుకొని వెక్కివెక్కి ఏడ్వ సాగింది. ఆమె స్నేహితురాళ్ళు రాణి, శశి, వత్సల, శాంతి కాంతి, నర్మద, సుధ, గీత, శోభ, కలంస్నేహితురాలో రమ ఆమెవెంటే గదిలోకి వచ్చి మంచంచుట్టూ నిలబడ్డారు అయోమయంగా, ఏమీ చేయడానికి తోచక, మాట్లాడటానికి పాలుపోక.

పది నిమిషాలు గడిచాయి.

రమ మంచంలో ఉమపక్కన కూర్చుండి ఆమె తల నిమరసాగింది, ప్రేమగా. ఉమ దుఃఖం మరింత


ఘుమడించింది. స్నేహితురాలి ఒడిలో తల పెట్టుకొని, చేతులతో ఆమెను చుట్టేసి బేలగా, జాలిగా రోదించ సాగింది. పక్కన నిలబడిన స్నేహితురాళ్ళేమీ చెయ్యలేక పోతున్నారు; చెప్పలేకపోతున్నారు. స్నేహితురాలి పెళ్ళి ఆగిపోయినందుకు వారి మనస్సులు విలవిల్లాడు తున్నాయి. హృదయాలు మూగగా రోదిస్తున్నాయి. తనను చుట్టేసుకొని రోదిస్తున్న ఉమ శరీరాన్ని ప్రేమగా, సానుభూతిగా నిమురుతూ ఉండిపోయింది రమ.

రోదిస్తున్న ఉమ మస్తిష్కంలో వేయి, లక్ష, కోటి ఆలోచనలు ముసురుకుంటున్నాయి. తను. . . తను. . . తన పెళ్లి ఏ అవరోధం లేకుండా జరిగితే తను ఈపాటికి కొత్తపెళ్లికూతురు. కొత్తకోడలు. కాని ఇప్పుడు ఉత్త ఉమ మాత్రమే! ఛీ . . . ఛీ! మనుష్యులు డబ్బుకోసం ఎంత కక్కుర్తి పడతారు? ! ఆ సుందరమ్మ . . . ఆమె మాట, పెళ్లికొడుకు. . . అతని మాట. . . పైగా బి. ఎ. కూడా చదువుకున్నాడు! సంస్కారంలేని చదువులెందుకు? మంచి, మర్యాద, మన్నన, మానవత్వంలేని బ్రతుకులెందుకు?. . . నాన్నమాత్రం కట్నం డబ్బు ఇవ్వనన్నాడా? అన్ని ప్రయత్నాలు చేశాడు. కాని, విధి వక్రించింది. పెళ్లిపనుల్లో అలిసిన నాన్న తాళంచెవుల గుత్తి మరిచాడు. డబ్బు దొంగిలించబడింది. పాపం! నాన్న ఎంత కుమిలిపోతున్నాడో! తనను బి. ఎ. చదివించడానికి ఎన్ని బాధలు పడ్డాడని. . . తన పెళ్లి ఆగిపోయినందు వల్ల నాన్నకి ఎంత తలవంపులు? నాన్న. . . పిచ్చినాన్న. . . తనకోసం ఎంత శ్రమకోర్చి ఆ పదివేల రూపాయలకు భీమా చేశాడని? రెక్కలు ముక్కలయ్యే గుమాస్తాగిరీ పొద్దంతాచేసి, భీమాపాలిసీ డబ్బు కోసం రాత్రివేళ కొట్లలో పద్దులు రాసేవాడు. మిగిలిన ఇంటికి తనను ఇవ్వాలని ఇంటినికూడా తాకట్టు పెట్టి డబ్బు తెచ్చాడు. ఆ డబ్బును ఎవరు కాజేశారో? ఇపుడు తాము రెంటచెడిన రేవడులు. ఆ డబ్బే ఉండిఉంటే తన పెళ్లి జరిగిపోయేది. ఇప్పుడు తన పెళ్లి జరగటానికి ఐదు వేలు కావాలి. . . ఐదు వేలు. . . ఐదు వేలు. . . ఇప్పు డీ పెళ్లి ఆగిపోయినందువల్ల మగపెళ్లివారికేం నష్టం లేదు. అంతా తమకే! మగపెళ్లివారు లాభ పడతారు. కట్నండబ్బు ఇవ్వలేదని ఘనంగా చెప్పు కుంటారు. వారికి మరో సంబంధం కుదురుతుంది. ఘనంగా పెళ్లి జరుగుతుంది. ఈ సమాజం ఆడపెళ్లి వారినే హీనంగా చూస్తుంది. ఎగతాళి చేస్తుంది. మగపెళ్లివారిని గౌరవిస్తుంది. కర్పూరనీరాజనం పడుతుంది.

కాని, ఇలాటివారిని వదిలిపెట్టకూడదు. వెంటబడి వేధించాలి, సాధించాలి. సాధించాలంటే తను వారి ఇంటి కోడలు కావాలి. కోడలు కావాలంటే ఇప్పుడు ఉన్నపళాన ఐదు వేలు. . . ఐదు వేలు. . . ఐదు వేలు. . .

ఐదు వేలు. ఉన్నపళాన ఐదు వేలు కావాలి అనుకునేసరికి ఆమెకు అంత ఆవేదనలోను. . . తనలో దానవి ఆశకి నవ్వు వచ్చింది. ఆమె కళ్లు మిలమిలా మెరిశాయి. ఆమె ముఖంలోకి చూస్తున్న రమ, ఆమె ముఖకవళికల్ని గమనించి విస్మయపడి, "ఏమిటే, ఉమా! ఎందుకా నవ్వు?" అంది.

"ఇప్పుడు ఐదు వేలుంటే నా పెళ్లి జరుగునుగదా అని."



అలనాటి అలంకారం

చిత్రం—వి. జనార్దనరావు (భోపాల్)

"ఐదు వేలు నే ఇస్తాను. ఆ అబ్బాయిని పెళ్లాడతావా?" అంది రమ.

ఉమ రమ కన్నుల్లోకి అనుమానంగా, ఆశ్చర్యంగా చూసింది.

"నిజం, ఉమా! ఐదు వేలే కాదు, ఏభై వేలంటే ఇప్పుడు నే నివ్వగలను. కాని, నీవు ఆ అబ్బాయిని పెళ్లాడతావా అని?"

"ఎందుకు పెళ్లాడను? ముందు ఒప్పుకున్నది పెళ్లాడటానికేగా?"

"అప్పుడు వేరు. ఇంత జరిగి, అబ్బాయి, ఆయన తల్లి డబ్బుకోసం ఇంత మూర్ఖంగా, పశువుల్లాలా ప్రవర్తిస్తారని తెలిశాకకూడా ఇష్టపడుతున్నావా?"

"ఇప్పుడు మరీ ఇష్టపడుతున్నాను. తప్పక ఇలాటి వారి ఇంటికే కోడలు కావాలనిపిస్తూంది."

"అయితే, లే! డబ్బుగురించి నేను వారితో మాట్లాడతాను." రమ లేచి నిలబడింది.

"రమా!" అంది ఉమ ఏదో చెప్పాలని ఆవేదనా నందాలతో.

చుట్టూ నిలబడిన మిత్రురాళ్లు గుడ్లప్పగించారు.

"నే చెప్పిన మాట నిజం, ఉమా! ఎలాగైనా నీ పెళ్లి జరగడమే నా క్కావలిసింది. ఈ డబ్బు నేను స్నేహపూర్వకంగా ఇస్తున్నాను. ఆపదల్లో ఉన్నప్పుడు ఆదుకోవటం స్నేహధర్మం...ఈ మాట నే పెళ్లిపందిట్లోనే చెప్పేదాన్ని. కాని, ఆ తల్లీకొడుకులు పరిస్థితుల నర్థం చేసుకోకుండా చిందులాడుతుంటే నాకు బలే చిరాకనిపించింది. అసహ్యం వేసిందికూడా. ఈ పెళ్లి తప్పిపోవటమే మంచిదనుకున్నాను. కాని, నీవు ఆయన్నే పెళ్లాడతానంటున్నావు."

"రమా! నా కోసం. . . ఐదువేలు. . ." ఆమె నోటి నుంచి మాటలు బయటపడటం లేదు.

"పిచ్చి ఉమా! నీ లాటి సౌజన్యమూర్తి, ప్రేమమయి అయిన స్నేహితురాలికి ఆపదలో ఉపయోగపడకపోతే నావద్ద ఉన్న ఆస్తికి అర్థం లేదు. అది దండుగ. ఉమా! నీ మనసులోకి ఏ శంకా రానివ్వకు. నాన్నగారు

చివరకు అతను ఆమెను మంచంమీదికి లాగాడు. ఆమె విదిలించుకుంది కోపంగా. అతను ఔత్తర పోయాడు ఆమె ప్రవర్తనకి.

"ఏమిటిది?" అన్నాడు ఆశ్చర్యంగానే.

"ఏది?"

"ఈ విదిలింపు."

"ఇలాటి పిచ్చిపనులు నా కిష్టం లేదు."

"ఎందుకని?"

"అది అంతే!"

"అయితే మరి పెళ్ళెందుకు చేసుకున్నావ్?"

"ఇందుకని మీరు చేసుకోలేదు, నే ననుకోలేదు. మీ ప్రవర్తన నా కలా అనిపించలేదు."

అతను మరి మాట్లాడలేదు. ఆమె మంచంలో ఓ మూలన ఒదిగి పడుకుంది. ఓ గంట గడిచాక అతను ఆమెమీద చేయి వేశాడు. ఆమె విదిలించుకొని లేచి, ఓ తలగడ, దుప్పటి తీసుకుని క్రింద పరుచుకుని పడుకుంది.

మూడు రోజులు ఇలాగే నిస్సారంగా గడిచిపోయాయి. కాని, సురేందర్‌రెడ్డి ఈ రహస్యాన్ని బయటపడనివ్వ లేదు. భార్య తత్త్వమేమిటో అతని కర్థం కాలేదు. పొద్దంతా సరదాగా తిరుగుతుంది. కబుర్లు చెబుతుంది. పరాచికాలాడుతుంది. నవ్విస్తుంది. కవ్విస్తుంది. కాని, రాత్రి-అదీ మంచం దగ్గరికి రాగానే ఓగుసుకుపోతుంది. తన బి. ఎ. విజ్ఞానాన్ని ఉపయోగించి, ఎంత యోచించినా అతనికేమీ తోచలేదు.

ఉమ అత్తవారింట్లో ఉన్న ఈ వారం రోజుల్లో తన గది వదిలి బయటికి వచ్చిన సమయం చాలా తక్కువ.

మరో వారం రోజులు గడిచాయి. తన భర్తకి, అత్తమామలకి వారు చేసిన తప్పు వారికి తెలిసివచ్చి కనువిప్పు కలిగేలా ఎలా చేయాలా అని తీవ్రంగా ఆలోచిస్తూనే ఉంది ఉమ. ఆమె అత్తవారింట్లో ఉన్న ఈ పదిహేను రోజుల్లో ఇటు పుల్ల తీసి అటు పెట్టలేదు. తన కవసరమైన కొన్ని పనులున్నప్పుడు మాత్రమే గదిదాటి బయటకు వచ్చింది. మిగతా సమయాల్లో పుస్తకాలు, పత్రికలు చదువుతూ కూర్చున్నది. 'కొత్త కోడలుకదా!' అని వేళకు కాఫీ, ఫలహారం, భోజనం అన్నీ సుందరమ్మే గదిలోకి తీసుకెళ్ళింది.

ఒకనాడు సుందరమ్మ అంది: "ఉమా! మనం కడుపులో చల్ల కదలకుండా ఇలా కూర్చుండి తినటానికి మహారాణులమా? కష్టం చేసుకోవాలి, కడుపునిండా తినాలి."

"నా కా అవసరం లేదు." కటువుగా అంది ఉమ.

కోడలి సమాధానం విని అదిరిపడి చూసింది సుందరమ్మ ఆమె వేపు.

"నే నే పనీ చేయను. మహారాణిలా కాలుమీద కాలు వేసుకుని కూర్చొని తింటాను. ఎవరి హద్దుల్లో వారుండటం మంచిది. హద్దు మీరి అధికారం చలాయించ ప్రయత్నిస్తే మర్యాద దక్కదు." ఖండితంగా అందామె, అత్తవేపు ధీమాగా చూస్తూ.

సుందరమ్మ కిక్కురుమనకుండా వెళ్ళిపోయింది. సాయంత్రం కొడుకు రావటంతోటే ఉన్నవీ, లేనివీ కల్పించి కోడలిమీద ఫిర్యాదు చేసింది సుందరమ్మ.

సురేందర్ తల్లి మాటలు విని, మండిపడుతూ గదిలోకి వచ్చి, "ఉమా! నీవు అమ్మతో అన్న మాటలు నిజమేనా?" అన్నాడు కోపంగా.

"నిజమే!" ఇలాటి ఉపద్రవం వచ్చిపడుతుందని ముందే ఊహించిన ఉమ తొణకకుండా సమాధానం చెప్పింది.

తన ప్రశ్నకు మౌనం వహిస్తుందని ఊహించిన సురేందర్‌రెడ్డి దెబ్బ తిన్నట్టుగా చూశాడు భార్యవేపు. అతని క్రోధం ఇనుమడించింది.

"చదువుకున్న దానివనీ, నీ అంతగా నీవు తెలుసుకుంటావనీ ఉపేక్షించినకొద్దీ మితిమీరు తున్నావ్."

"అని మీ రనుకుంటున్నారు." బెదిరిపోలే దామె.

"మాటకు మాట. . . యూ ఫూల్. షటప్." బిగ్గరగా అరిచా డతను.

"నాకూ ఇంగ్లీష్ వచ్చు" అం దామె తాపీగా.

ఆమె మాటకి అతను అదిరిపడ్డాడు. 'అంటే తనూ నన్ను తిట్టగలననా?'

"యూ. . . రోగ్." పళ్ళు నూరా డతను.

"మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి." ఆమె మాటలు మృదువుగా ఉన్నాయి.

"యూ. . . రాస్కెల్." కొట్టడానికి చేయెత్తా డతను.

ఆమె అతని ఎత్తిన చేయిని అలాగే కిందికి దించ కుండా పట్టుకొని ఆపి, "నాకూ ఇంగ్లీష్ వచ్చు. మీకన్నా స్పీడ్‌గా మాట్లాడగలనుకూడా. మీరు బి. ఎ. థర్డ్ క్లాస్. నేను బి. ఎ. ఫస్ట్ క్లాస్. మీ లాగే నాకూ కాళ్ళూ చేతులూ ఉన్నాయి అవసరాని కుపయోగ పడేందుకు! కాని నేనుకూడా మీలా తొందరపడి నోరు, చేతులు పారేసుకో దలుచుకోలేదు. ఆడదాని సహనాన్ని అసమర్థతగా అర్థం చేసుకుంటాడు మగవాడు" అం దామె. ఆమె మాటల్లో శాంతం, మృదుత్వం, సహనం తొణికిసలాడుతున్నాయి.

ఆమె మాటలు అతనికి ములుకుల్లా తగిలాయి. శూలాల్లా గుచ్చుకున్నాయి. అతని మనస్సులో బాకుల్లా నాటుకున్నాయి. అతని హృదయం గిలగిలలాడింది. ఐనా అతనిలోని పురుషత్వపు పౌరుషం ఊరుకోలేదు.

"నీవు బి. ఎ. చదివినా నాకు భార్యవేకాని భర్తవు కాలేవుగా?"

"నేనూ అదే అంటున్నాను. నేను మీ భార్యనేగాని బానిసను గాను."

"భార్య బానిసతో సమానమే! పొగరుమాటలు మాని చెప్పినట్టు విని ఓ మూల పడి ఉండు."

"నే నలా ఉండను. అది నా వల్ల కాదు."

"ఏం? వంట చేయటంకూడా చేతకాదా?"

"వంట నేనే ఎందుకు చేయాలి? మీరు చేయ కూడదా? లేకపోతే కలిసి ఉద్యోగం చేద్దాం. కలిసే వంట చేద్దాం. భార్యాభర్తలు ఒకరిలో ఒకరు చెరి సగమునా?" వ్యంగ్యంగా అం దామె.

"నీ, బి. ఎ. చదువు బియ్యం కడగటానికే పనికి వస్తుంది." అతనిలోని ఆగ్రహం వాస్తవాన్ని గమనించ నీయటం లేదు.

"ఆ మాటే నేనంటే. . .?" శాంతగంభీరంగా అం దామె.

"నాలుక చీరేస్తాను." ఇక గదిలో నిలబడి వాగ్వాదం పెంచడం తన పరువు తాను తీసుకోవడమేనని తలచి, గిరుక్కున వెనుదిరిగి, చరచరా గదిలోనించి వెళ్ళి పోయాడు. అతనిలోని ఆగ్రహానికి పురుషాహంకారం తోడై అతనిలో కార్చిచ్చు రగుల్చసాగింది.

'అణకువగా ఉన్నప్పుడే ఆడదానిమీద అధికారం చలాయించి, అదుపులో పెడతాడు మగవాడు. అదే ఆడది బరితెగించి, ఆడసింహంలా గర్జిస్తే ఆమడదూరం పరుగెత్తుతాడు.'

వెళ్ళిపోతున్న భర్తను చూస్తున్న ఉమ 'పాపం!. . .' అనుకుంది.

* * *

మరో వారం రోజులు గడిచాయి.

ఈ వారం రోజుల్లోకూడా ఉమ కించిత్తు పని చేయలేదు. సుందరమ్మ కోపంలో కోడలికి కాఫీ ఫలహారాలు, భోజనం అందించడం మానేసింది. ఉమ వేళకి వంటగదిలో చేరి అత్తయ్య వండిన వంటకాలని తనే వడ్డించుకొని తినటం సాగించింది.

ఆడది అదుపు తప్పితే, ఆమెను లొంగదీసి పెట్టటం ఆమెను సృష్టించిన బ్రహ్మతరంకూడా కాదేమో!

ఒకనాడు . . .

ఉదయంపూట సురేందర్‌రెడ్డి కాఫీ త్రాగుతున్నాడు. అప్పుడే లేచి కళ్ళు నులుముకుంటూ కూర్చున్న ఉమ, "నేను దొడ్డికి వెళ్ళాలి" అంది భర్తవేపు ఓరగా చూస్తూ.

అతను భార్యవేపు అయోమయంగా చూశాడు.

"అలా చూస్తారేం? ... కాస్త లోటా (చెంబు)తో నీళ్ళు తెచ్చిపెట్టండి."

అతను ఆమెవేపు కరకర నమిలి మింగుదునా అన్నట్టు చూస్తూ, పళ్ళు పటపట కొరుకుతూ 'యూ. . . మాసర్‌లెస్ క్రీచర్. నిన్ను నిలువునా చీల్చేస్తాను." తన శరీరంలోని శక్తినంతా ఒకచోట చేర్చి గది దద్దరిల్లేలా అరిచి, తన చేతుల్లో ఉన్న కప్పును ఓ మూలకు విసిరికొట్టి, పులిలా పొంగుతూ ఆమెమీదికి రాసాగాడు.

ఆమె చలించలేదు. అదిరిపడలేదు. కూర్చున్న చోటు నుంచి కదలలేదు. పైగా, ప్రసన్నవదనంతో, చిన్నగా నవ్వుతూ, "అలా కోపగించుకుంటారేం?. . . పదిహేను వేల రూపాయలకు చెక్కును ఇచ్చి మిమ్మల్ని కొన్నాను. మీరు నేను చెప్పిన మాట వినకపోవటం ధర్మమా? అహా. . . ధర్మమేనా అని? మీరు చదువుకున్నవారు. ఇది మర్యాదేమో ఆలోచించండి" అంది.

ఆమె నవ్వుతూ అన్న మాటలు అతని ముఖంమీద

పువ్వులు

పువ్వులే ప్రేముడి యథార్థ పదార్థాలు.

—పి. బెంజమిన్

అనుకరణ

అనుకరణ ఎంతో నిజాయితీ కల పొగడ్త.

—కాటన్

చెప్పు పుచ్చుకొని విరామంలేకుండా కొట్టినట్టు తగిలాయి. మండుతున్న పుండుమీద కారం చల్లినట్టుం దా నవ్వు, మాట. "అమ్మా!" అంటూ మేడ ప్రతిధ్వనించేలా అరిచా డతను.

ఉమ పకపక నవ్వసాగింది. అతని గుండెల్లో మంటలై, భగభగ మండసాగాయి ఆ నవ్వులు.

సుందరమ్మ "ఏమిట్రా?" అంటూ వచ్చిం దక్కడికి గబగబా.

"మొన్న చెక్ విడిపించి తెచ్చిన పదిహేను వేలు కావాలి."

"ఇప్పు డవెందుకురా?"

"కాల్చి బూడిదచేసి, కడుక్కు తాగటానికి. తే ముందు." కోపంగా చూశాడు తల్లివేపు.

"ఎందుకో చెబితే కాని ఇవ్వను." మొరాయించిం దామె.

"మర్యాదగా నీవెందుకిస్తావ్? నేనే తెచ్చుకుంటాను" అంటూ చరచరా బీరువా ఉన్న గదిలోకి వెళ్లి, దాని తాళం పగలగొట్టి పదిహేను వేలు లెక్కపెట్టి తెచ్చి ఉమముందు పెట్టి, "ఉమా! ఇక నీ మాటలతో నన్ను క్షణక్షణం చిత్రహింసకు గురిచెయ్యకు. ఇదో నీ డబ్బు. నిన్నెవరు ఏమీ అనరు. నీ కిష్టమైతే ఉండు. లేదా వెళ్లిపో! విడాకులకి ఏర్పాటు చేస్తాను. అంతేగానీ, ఈ ఈటెలవంటి మాటలతో నా హృదయాన్ని తూట్లు పొడవకు. బాకులవంటి చేతలతో నన్ను చిత్రవధ చేయకు" అన్నాడు తల విదిలిస్తూ, ఆమె మాటల పదునును భరించలేనన్నట్టు.

"పదునైన ఈ ఈటెలవంటి మాటలవల్ల మనుష్యులు చిత్రహింస ననుభవిస్తారని, మొనదేలిన బాకులవంటి చేతలవల్ల హృదయాలు తూట్లుపడతాయని, మనుష్యులు చిత్రవధకు గురి అవుతారని, ఆ చిత్రవధ ఎంత క్రూరంగా, బాధావహంగా ఉంటుందో మీరు స్వయంగా అనుభవించి తెలుసుకున్నారు. ఆ నరక యాతన ఎలాటిదో మీకు తెలిసివచ్చింది. నా ఈ వింతప్రవర్తనంతా మీకు కనువిప్పు కలగాలనే. ఒక్క మీకేకాదు, కత్తులు కఠారులు లేకుండానే ఆడ పిల్లల్ని, ఆడపిల్లల తలిదండ్రుల్ని చిత్రవధచేసే మీవంటి వాళ్లకి కనువిప్పు కలిగితేనే కన్యల కష్టాలకి విముక్తి; కన్న తలిదండ్రులకి కంటినిండా నిద్ర. ఆనాడు మీరు పెళ్లిమంటపంలో ఈ విజ్ఞత ప్రదర్శించి ఉంటే, ఈనాడు ఇంత బాధ పడవలిసివచ్చేది కాదు. ఇక నేను మీ భార్యగా—కాదు—దాసిగా మసులు కుంటాను. నేనేకాదు, ప్రతి ఆడపిల్లా అలాగే మసులుకుంటుంది" అం దామె శాంతగంభీరస్వరంతో.

సుందరమ్మ ఉలుకు, పలుకు లేకుండా శిలాప్రతిమలా నిలబడిపోయింది.

* * *

మరునటిరోజు తెల్లవారుఝామున నాలుగు గంటలకే లేచి, కాలకృత్యాలు ముగించుకొని, వంట సామాన్లు తోమి, కడిగి శుభ్రంచేసిపెట్టి, ఇల్లంతా ఊడ్చి, తెల్లారేసరికి కాఫీ, టిఫినులు సిద్ధం చేసింది ఉమ.

రోజులా తెల్లవారాక సుందరమ్మ లేచి వంటగది దగ్గిరికి వచ్చేసరికి, ఉమ ఆమెకు గుమ్మంలో ఎదురయి, "అత్తయ్యా! ఈ రోజు ఏం కూర చేయాలి?" అంది.

ఈ ఆకస్మికమయిన మార్పుకు ఎదురుచూడని సుందరమ్మ విస్మయంతో నోరు తెరిచి, అలాగే నిలబడి పోయింది.

ఉమ చకచకా తమ పడకగదిలోకి పరిగెత్తి, గురక పెట్టి నిద్రపోతున్న భర్తని తట్టి లేపుతూ, "లేవండి. పొద్దెక్కేవరకు పడుకుంటే మస్తుగా ఉంటుంది" అని ఆయన్ని లేపి కూర్చోబెట్టింది. అతను లేచి కూర్చొని భార్యవేపు వింతగా చూశాడు.

"అలా చూస్తున్నారేం?. . . నేనేం కొత్తగా కనిపిస్తున్నానా?. . ." అని బ్రష్‌పై పేస్ట్ వేసి తెచ్చి అతని కందించి, "త్వరగా తెముల్చుకొని రండి. కాఫీ చల్లారిపోతుంది" అని చకచకా తిరిగి వెళ్లిపోయింది. అతను అయోమయంలోనే పెరట్లోకి నడిచాడు.

"అత్తయ్యా! మీరు పెద్దవారైపోయారు. ఇన్ని రోజులు మీరు ఎలాగూ చేయక తప్పలేదు. ఇక నుండి మీరు ఏ పనులు చేయకూడదు. అన్నీ నేనే చేస్తుంటాను. మీరు చూస్తూ చెబుతుండాలి."

వంటగదిలో పీటమీద కూర్చుని ఉన్న సుందరమ్మ, ముఖం కడుక్కొని వంటగదిలోకి వస్తున్న సురేందర్‌రెడ్డి

> **గ్రంథాలయం**
>
> ఈ రోజుల్లో నిజమయిన విశ్వ విద్యాలయం గ్రంథాలయమే.
>
> —కార్లైల్

ఉమ నోటినుండి వచ్చిన ఈ మాటలు విని ఆశ్చర్యంలో, అయోమయంలో పడి కొట్టుకుపోయారు.

రాత్రి పది గంటలకి వంటిల్లు సర్ది పడకగది చేరుకున్నది ఉమ. భర్త ఏదో పుస్తకం చదువు కుంటున్నాడు. ఆమె అతని చేతిలోంచి పుస్తకం లాగి, దూరంగా గిరవాటేసి "లేవండి" అంటూ చేయి పట్టి లేపింది. సురేందర్‌రెడ్డి వెళ్లి మంచంలో ఆసీనుడయ్యాడు. ఆమె తలుపులు మూసి, లైట్ ఆర్పేసి, బెడ్ లైట్ వెలిగించి వచ్చి, భర్త పక్కన కూర్చుండి, అతని చుట్టూ తన చేతులను పెనవేసి, అతని ఎదపై తల వాల్చి, "ఇన్ని రోజులనుండి మిమ్మల్ని నాతిగం బ్రహ్మవారిని చేసి బాధించాను. ఇక మీ ఇష్టం. నన్నేమైనా చేసుకోండి. ఇరవై రోజులనుండి నేను వింతగా ప్రవర్తించి మీ మనసు నొప్పించాను. నన్ను మన్నించరూ?" అం దామె, గోముగా భర్త షర్టు గుండీలను మెలితిప్పుతూ.

"మన్నించను" అన్నా డతను.

"అయితే శిక్షించండి. మీ రే శిక్ష విధించినా ఆనందంగా అనుభవిస్తాను."

"తరవాత కాదు, కూడదనవద్దు" అని ఆమెను తనలో పొదువుకున్నాడు. ఆమె అతనిలో గువ్వపిట్టలా ఒదిగిపోయింది సర్వం మరిచి.

ఉమ తెల్లవారుఝామున నాలుగు గంటలకే లేచి, తెల్లవారేసరికి కాఫీటిఫిన్‌లు తయారుచేస్తుంది. ఆ తరవాత భర్తకి మేలుకొలుపు పాడుతుంది. తొమ్మిది గంటల వరకు వంట సిద్ధం చేస్తుంది. మళ్లీ సాయంత్రం నాలుగయ్యేసరికి కాఫీటిఫిన్‌లు రెడీ! రాత్రి తొమ్మిదయేసరికి భోజనాలు ముగుస్తాయి. పదింటికల్లా ఆ రోజు విడిచిన బట్టలన్నీ పిండేస్తుంది. ఆ తరవాత పడకగది చేరి భర్తకి జోల పాడుతుంది. ఆమె పొద్దంతా ఇంత పని చేసినా ఎప్పుడూ విసుక్కోదు. సదా ఆమె ముఖంలో చిరుదరహాసం చిందులాడు తుంది. ఇదీ ఆమె దినచర్య. ఆదివారాలు సినిమాలు, షికార్లు.

"ఉమా! పాచిపని చేసి, ఇల్లు ఊడ్చి, బట్టలు ఉతక టానికి ఒక పనిమనిషిని పెడతాను" అన్నాడు సురేందర్ రెడ్డి ఒకసారి ఉమతో.

ఆమె భర్తవేపు చురచుర చూసింది. "మీ రా మాటంటే నే నూరుకోను. నాకు ఒంట్లో ఓపిక, శక్తి ఉన్నాయి. . . ఆ అవసరం కలిగినప్పుడు నేనే స్వయంగా మీతో విన్నవించుకుంటాను. మీకు డబ్బు దుబారా చేయటమొక్కటే తెలుసు." మెత్తగా మందలించిం దామె భర్తని.

"నువ్వీ పనులన్నీ చేయటం నాకు నామోషీగా ఉంది."

"భలే! నా ఇంటిపనులు నేను చేసుకుంటుంటే మధ్య మీ కెందుకు నామోషీ?"

"ఉమా! నీవు నా అంత చదువుకున్నదానివి. . ."

"చదువుకున్న ఆడది పనులు చేసుకోకూడదని ఉందా ఎక్కడైనా?"

"అదికాదు, ఉమా! చిల్లర పనులకన్నా ఓ పని మనిషిని. . . నువ్వు పాచిపని చేయడం, బట్టలు ఉతకడం నాకు బాధగా ఉంది."

"ఏదీకాదు. అసలు మీకేం తెలియదు. నే నంత సుకుమారినేం కాదు. . . ఏమండోయ్. . .! పెళ్లాన్ని ఇంత దయగా చూస్తే నెత్తికెక్కి కూర్చుంటుంది. ఆమెచేత ఎప్పుడూ వెట్టిచాకిరి చేయిస్తూనే ఉండాలి. అప్పుడే చెప్పినట్టు వింటుంది. . . ప్రతి ఒక్కరూ చేతనైనంతవరకు తమ పనులు తాము స్వయంగా చేసుకోవడం ఉత్తమం. ఇక ఎప్పుడూ ఇలాటి మాటలు నా ముందు తేకండి. అయినా. . . నాకు తెలియు కడుగుతాను. పనులు చేసేదాన్ని నేను. నాకు లేని బాధ మీ కెందుకు?. . ." భర్తవేపు చిరుకోపంతో చూసిం దామె.

సురేందర్‌రెడ్డి మరి కిక్కురు మనలేదు. ఆమె కళ్లల్లోకి కృతజ్ఞతగా చూశాడు. 'కట్నండబ్బుకోసం కక్కుర్తిపడి, ఇంతటి దేవతామూర్తిని కటిక పాషాణాన్నిగా తయారుచేసి, అమృతభాండాన్ని హాలాహలంగా మార్చుకో యత్నించిన మూర్ఖుణ్ని . . . స్వర్గంలా ఉండవలిసిన సంసారాలు నేడు ఇలా నరకాలుగా మారటానికి కట్నాలే కారణమా? అంతే కాబోలు!. . . అందుకు తన కాపరమే నిదర్శనం కాదా?' అనుకున్నాడు.

పూజగదిలోంచి కొడుకు, కోడళ్ల మాటలు విన్న సుందరమ్మ మురిసిపోయింది.

ఉమను ఆ ఇంటి దేవతగా చూడసాగారు భర్త, అత్తమామలు.

అత్తమామల్ని తలిదండ్రులకన్నా మిన్నగా పూజిస్తూ, భర్తను దైవంకన్న మిన్నగా సేవించసాగింది ఉమ. ★